సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నిరసనలో పాల్గొన్న శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం

హఫీజ్‌పేట్ : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ విమర్శలు చేసే అర్హత లేదని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు బాల్క సుమన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడే తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఉందన్నారు. ఆయన సంస్కార హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడే భాష తీరు మారకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరగబడతారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. పీసీసీ సెక్రటరీ సీనియర్ నాయకులు జైపాల్, శేరిలింగంపల్లి కో– ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మహిపాల్ యాదవ్, యాదయ్య గౌడ్, కాటా నర్సింహ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, రాజు, విజయ్ భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి, ఆశీల శివకుమార్, కృష్ణయాదవ్, సౌందర్య రాజన్, రేణుక, జహంగీర్, అలీ బాబా, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి..

మియాపూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మియాపూర్‌లోని కాంగ్రెస్ నేతలు మంగళవారం నిరసన చేపట్టారు. మియాపూర్ ప్రధాన రహదారిపై బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో డీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఎం స్థాయి వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అన్యాయమని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ నాయకులు భరత్‌కుమార్, సందీప్‌రెడ్డి, వినోద్, రవి, కాశీ ఉన్నారు.





బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

లింగంపల్లి రైల్వేస్టేషన్ సందర్శన

- వలు సమస్యలపై చర్చించిన సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు కాశీనాథ్
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వెల్లడి

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు కాశీనాథ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం స్టేషన్ మేనేజర్ రాజు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్‌తో సమావేశమయ్యారు. స్టేషన్‌లోని రైల్వే సిబ్బంది, ప్రయాణికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవరింగ్ ఫ్లాట్‌ఫామ్ లేకపోవడంతో ఫ్లాట్‌ఫామ్ నెంబర్ 2,3,4 ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని గుర్తించానన్నారు.

పరిగణలోకి వచ్చిన అంశాలు..

- పార్సల్ ఆఫీస్ బిల్డింగ్ అసంపూర్తిగా ఉందని, దాన్ని వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
- స్టేషన్‌కు రావడానికి అప్రోచ్ రోడ్డు కూడా కావాలని ప్రయాణికులు కోరారని చెప్పారు. రైల్వే స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు బస్ సౌకర్యం కల్పించాలని వివరించారన్నారు.
- ప్రయాణికుల కోసం లాక్‌రూమ్ ఫెసిలిటీ కూడా కావాలని తమ దృష్టికి వచ్చిందని స్పష్టం చేశారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు.



స్టేషన్ మేనేజర్, రైల్వే అధికారులతో కాశీనాథ్

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్



నిందితుడు సంజయ్‌కుమార్

భాగ్యనగర్‌కాలనీ: పగలు రెక్కీ... రాత్రిళ్లు చోరీ... ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడుతున్న యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్‌తో కలిసి కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల గ్రామానికి చెందిన పెడవల్లి సంజయ్‌కుమార్ (23) అనే యువకుడు కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్టలో ఓ హాస్టల్‌లో నివాసముంటున్నాడు. పగలు రెక్కి నిర్వహించి తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడుతున్నారు. ఇండ్ల తాళాలను ఇనుప రాడ్ సహాయంతో పగుల గొట్టి చోరీకి పాల్పడిన అనంతరం ఆ ఇంటికి మరో తాళం వేసి పారిపోయేవాడు.

- గత నెల 30వ తేదీ కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజులో ఇదే రీతిన చోరీకి పాల్పడ్డాడు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం అడ్డగుట్టలో అనుమానస్పందంగా తిరుగుతున్న సంజయ్ కుమార్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా పాత నేరస్తుడిగా గుర్తించారు.
- దీంతో అతని వద్ద రూ.12 లక్షల విలువ చేసే 20.6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సంజయ్ గతంలో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే 5, తిరుపతిలో 5 చోరీలకు పాల్పడినట్లుగా ఏసీపీ తెలిపారు. కేసును త్వరితగతిన పరిష్కరించిన సీఐ వెంకన్న, డీఐ రాజేందర్‌గౌడ్, కానిస్టేబుళ్లను ఏసీపీ శివభాస్కర్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో హ్యాండ్ ఆఫ్ హోమ్ మెడికల్ టీమ్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే గాంధీకి సమస్యలు వివరిస్తున్న స్థానికులు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి సప్తగిరి కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం సప్తగిరి కాలనీవాసులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. త్వరలోనే కాలనీలో పర్యటించి తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కాలనీవాసులు వెంకట్‌యాదవ్, నందు, అర్జున్, శ్రీరాములు, నర్సింహులు, శ్రీనివాస్, చెంచు రామయ్య, శ్రీధర్, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

రంగారెడ్డి అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: జాతీయ పోటీల్లో రంగారెడ్డి జిల్లా మాస్టర్లు, సత్తా చాటి పతకాలు సాధించాలని రంగారెడ్డి అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో అథ్లెట్లకు ట్రాక్ సూట్‌లను ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రాష్ట్ర పోటీల్లో రంగారెడ్డి మాస్టర్లు 111 పతకాలు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీల్లోనూ అధిక సంఖ్యలో పతకాలు సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపించే మాస్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్, ట్రెజరర్ స్వాతిగౌడ్, అథ్లెట్స్ చిరంజీవులు, శివలీల, సైనిక, శైలజ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్‌సూట్‌లను పంపిణీ చేస్తున్న కొండ విజయ్‌కుమార్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బుణాకర్‌మేళలో భాగంగా మంగళవారం యాంఫిథియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేశారు. సంస్కృతి ముదాల్కర్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. పుష్పాంజలి, బ్రహ్మాంజలి, అష్టపది, జతిస్వరం, మరకతమణిమయ తదితర అంశాలను కళాకారులు పవిక, అద్వైత, మీనాక్షి, షణ్ముఖప్రియ, మమతా, శ్రేష్ఠ, శ్రవంతి, స్ఫూర్తి తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు వాణిరమణ ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను ఆశీర్వదించారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని మైహోం మంగళ రోడ్డులో కూరగాయల మార్కెట్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్‌తో కలిసి జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. పర్యావరణం కాలుష్యం బారిన పడటంతో ప్రకృతి సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. బీజేపీ నాయకులు ఎల్లేష్, అంజనేయులు, శ్రీధర్, రమేష్, రవినాయక్, శ్రీశైలం, కుమార్‌యాదవ్, సాగర్, శ్రీకాంత్ తదితరులున్నారు.



జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్ యాదవ్

ప్రతీ వందేళ్లకు కొత్త సవాళ్లను ఎదుర్కొంటాం..

'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతి వందేళ్లకు మనం కొత్త సవాళ్లను ఎదుర్కొంటామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డైనమిక్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును ఆయన అధ్యక్షత వహించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం మనం 2047 శతాబ్దిలో ఈ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే కొత్త సవాలుకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలన్నారు. ఇది క్షణ్ణంగా స్నేహం చేయడం, అడ్డంకులను ఛేదించుకోవడం, ఎవరినీ వదలకుండా ప్రతి ఒక్కరినీ కలుపుకోవడం సాధ్యమవుతుందన్నారు. న్యూఢిల్లీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ హెడ్ ప్రొఫెసర్ రుమ్కీబసు ,ఆదాయపన్ను అసిస్టెంట్ కమిషనర్, ఐఆర్‌ఎస్ అధికారి డాక్టర్ వసీముర్ రెహమాన్‌లు మాట్లాడారు. అనంతరం సెమినార్ సావనీర్‌ను వైస్‌చాన్స్‌లర్ విడుదల చేశారు. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధిపతి, సెమినార్ కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆహ్మద్ రజా, లీగల్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాంశుచంద్ర ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రతినిధులు తమ పత్రాలను అందజేశారు.



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, శిశుమందిర్ రోడ్డు, బండ్లగూడ కాలనీల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం యాదవ సంఘం శ్మశానవాటికలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్ సౌజన్యంతో నిర్మించనున్న దహనవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, గోపాల్, ధనరాజ్‌గౌడ్, మాజీ వార్డుమెంబర్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకం..

10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాలతో పాటు తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ప్రారంభించారు. అనంతరం సొంత నిధులచే కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్, ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, సుప్రజ, దశరథ్‌రెడ్డి, పట్నం రాజు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వీరేందర్, డాక్టర్ పూర్ణ కృష్ణ, పాల్గొన్నారు.

మంజీరా తాగునీటి సరఫరా ప్రారంభం..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ, హెచ్ఐజీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా తాగునీటి సరఫరాను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఏడో విజయం



సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఏడో విజయం నమోదు చేసింది. గోవాలోని తిలక్ మైదాన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2–1 గోల్స్ తేడాతో చర్చిల్ బ్రదర్స్ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున డేవిడ్ కాస్టనెడా మునోజ్ (11వ ని.లో), ఎలీ సాబియో ఫిలో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... చర్చిల్ బ్రదర్స్ జట్టుకు కరీమ్ (88వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 23 పాయింట్లతో రియల్ కశ్మీర్ జట్టుతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది.

భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం కూకట్‌పల్లిలోని అడ్డాలో భారత్‌బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శంకర్, బి.రాములు భవన నిర్మాణ కార్మికులు నరసింహ, రామస్వామి, శంకర్, నాగన్న, అశోక్, శ్యామ్, రమేష్, కృష్ణ, అంజయ్య, పోచయ్య, భాస్కర్, శ్రీనివాస్, గోపాల్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్, బీఎస్పీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆంజనేయులు, ఎల్లయ్య, హనుమంతరావు, అఖిల్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

'మనూ'లో ఆడియో- విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయంలో ఆడియో–విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'మనూ'లోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, నేషనల్ కల్చరల్ ఆడియో విజువల్ ఆర్కైవ్స్ (ఎన్‌సీఏవీఏ), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంయుక్త సహకారంతో ఫిబ్రవరి 21–23 మధ్యన ఆడియో–విజువల్ ఆర్కైవింగ్‌పై మూడ్రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తుంది. ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహమద్, ఎన్‌సీఏఏ కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రతాపానంద్‌ఝా, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఇర్ఫాన్ జుబైరిలు పర్యవేక్షిస్తారు.

స్పెక్ట్రో ఫోటో మీటర్– బేసిక్‌పై..

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూవీ–వీఐఎస్ స్పెక్ట్రో ఫోటో మీటర్–బేసిక్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. 'మనూ'లోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ఐఆర్–ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకృతి రంజన్‌బంగల్ యూవీ–వీఐఎస్ స్పెక్ట్రో ఫోటో మెట్రీ వెనుక, అణువులతో కాంతి పరస్పర చర్యపై అవగాహన కల్పించారు. కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ రంగాల్లో దీని ప్రభావం గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ల్యాబ్‌లో హ్యాండ్ ఆన్ సెషన్స్ యూవీ–వీఐఎస్ విధులను తెలుసుకోవడానికి పాల్గొనే వారికి అవకాశం కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ అలీముద్దీన్, డాక్టర్ ఖాసీముల్లా, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో 'లైవ్ పాప్సికల్'

సాక్షి, సిటీబ్యూరో: అప్పటికప్పుడు సహజమైన పండ్ల సమ్మేళనాలతో డెజర్ట్ (లైవ్ పాప్సికల్స్) తయారు చేసి అందించే ఓ కేఫ్ మాదాపూర్‌లో అందుబాటులోకి వచ్చింది. స్కూజో ఐస్ 'ఓ' మ్యాజిక్ పేరుతో హైటెక్ సిటీ రోడ్ మాదాపూర్ వేదికగా ఈ వినూత్న డెజర్ట్ కేఫ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కె.చంద్ర శేఖర్ రెడ్డి, స్కూజో వ్యవస్థాపకుడు గగన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మంజీర పైపులైన్ పనులు పూర్తి చేయాలని వినతి



హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఫ్లైఓవర్ నుంచి హుడా కాలనీ వరకు చేపట్టిన మంజీర పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ఎండీ సుదర్శన్‌రెడ్డికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న మంజీరా పైపులైన్ పనులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తూ.. మౌలిక వసతులల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు.

సందడిగా బచ్‌పన్ స్కూల్స్ వార్షికోత్సవం



డ్యాన్స్‌తో అలరించిన విద్యార్థులు

గచ్చిబౌలి: చిన్నారుల ఆట,పాటలతో బచ్‌పన్ స్కూళ్ల వార్షికోత్సవం సందడిగా సాగింది. మంగళవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మాదాపూర్, కొండాపూర్ బచ్‌పన్ స్కూళ్ల వార్షికోత్సవం నిర్వహించారు. ఫెస్టివ్ థీమ్‌లో వసుదైక కుటుంబం, జాతీయభావం పెంపొందించే డ్యాన్స్‌లతో చిన్నారులు అలరించారు. బచ్‌పన్ స్కూల్స్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్స్ నిషా, రాఘవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రం అందజేత



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ కాలనీకి చెందిన మాలతి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. సహాయనిధి లక్ష రూపాయలకు చెందిన ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కాశీనాథ్ యాదవ్, సలీం, బాబు మియా తదితరులు పాల్గొన్నారు.

'సీలింగ్ భూములను పట్టా భూములుగా మారుస్తున్నారు'

- రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: సీలింగ్ భూములను పట్టాభూములుగా మార్పిడి చేస్తు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ సుచరితను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని దుండిగల్ గ్రామంలో 282 నుంచి 426 సర్వే నెంబర్లలోని పలు ప్రాంతాల్లో 106.07 ఎకరాల సీలింగ్ భూమి ఉందన్నారు. సీలింగ్, పట్టా భూములు పక్క పక్కనే ఉండడంతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భూములను మార్పిడి చేస్తున్నారని అన్నారు. ఇలా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462